తెలంగాణ
# ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ గురువారం 18- 12 - 2025 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 2

## మోత్కూరు మండల సర్పంచులు

**పాటిమట్ల**



బండ రమ (కాంగ్రెస్)

**పొడిచేడు**



జిట్ట సైదులు (కాంగ్రెస్)

**దత్తప్పగూడెం**



గుండు యాదగిరి (కాంగ్రెస్)

**సదర్శాపురం**



మునుకుంట్ల నీలకంఠం
(కాంగ్రెస్ రెబల్)

**దాచారం**



కర్నె జ్యోతి (కాంగ్రెస్)

**రాగిబావి**



మెందు శ్రీవాణి (బీఆర్ఎస్)

**పనకబండ**



లోతుకుంట రేణుక
(బీఆర్ఎస్)

**అనాజిపురం**



బీసు వెంకన్న (కాంగ్రెస్)

**పాలడుగు**



అంతటి భగవంతు
(బీఆర్ఎస్ బలపర్చిన
కాంగ్రెస్ రెబల్)

**ముశిపట్ల**



పైళ్ల నర్సిరెడ్డి(కాంగ్రెస్)

-(ప్రజావారధి/మోత్కూరు)

# మోత్కూరులో రసవత్తరంగా సాగిన పంచాయతీ పోరు

- 10 సర్పంచ్ స్థానాలకు 39 మంది, 85 వార్డులకు 205 మంది పోటీ
- కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 2, కాంగ్రెస్ రెబల్ 2 స్థానాల్లో గెలుపు



మోత్కూరు మండలం పొడిచేడులో ఓటు వేసిన మహిళలు



అనాజిపురంలో ఓటు వేసిన మాజీ జడ్పీటీసీ గోరుపల్లి శారదసంతోష్‌రెడ్డి

**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు మండలంలో పంచాయతీ ఎన్నికల పోరు రసవత్తరంగా నడిచింది. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే పోటీ కొనసాగింది. మండలంలో 10 గ్రామపంచాయతీలు ఉండగా ఆరు కాంగ్రెస్, ఒకరు కాంగ్రెస్ రెబల్, మరొకరు బీఆర్ఎస్ బలపర్చిన కాంగ్రెస్ రెబల్, రెండు బీఆర్ఎస్ గెలిచింది. మండలంలో 10 సర్పంచ్ స్థానాలకు 39 మంది, 85 వార్డులకు 205 మంది పోటీ పడ్డారు. మండలంలో 13215 ఓట్లు ఉండగా 11879 ఓట్లు పోలవ్వగా, 29 మంది ఎంప్లాయిస్ పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో మొత్తం 11908 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 5927, మహిళలు 5952 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలో 90.11 శాతం పోలింగ్ నమోదైంది. పాటిమట్ల గ్రామంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య టైట్ ఫైట్ నడిచింది. బీఆర్ఎస్ అభ్యర్థి గిరగాని ఉమపై కాంగ్రెస్ అభ్యర్థి బండ రమ 41 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 8 వార్డులకు కాంగ్రెస్ 5, బీఆర్ఎస్ 2, బీఆర్ఎస్ బలపర్చిన సీపీఎం మెంబర్ ఒకరు గెలిచారు. సదర్శాపురం గ్రామంలో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి గెలుపొందారు. ఎమ్మెల్యే సామేల్ ఇక్కడ వర్రె హరిప్రసాద్‌ను అభ్యర్థిగా ప్రకటించగా కాంగ్రెస్ క్యాడర్ తీవ్రంగా వ్యతిరేకించింది. దీంతో కాంగ్రెస్ నాయకులు మునుకుంట్ల నీలకంఠంను రెబల్ అభ్యర్థిగా నిలబెట్టగా ఆయన 113 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 8 వార్డులకు గాను నీలకంఠం వర్గం 4, హరిప్రసాద్ వర్గం 4 వార్డులు గెలుపొందారు. దాచారం గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి చిల్లర లింగమ్మపై కాంగ్రెస్ అభ్యర్థి కర్నె జ్యోతి 795 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఇక్కడ 10కి 10 వార్డులను కాంగ్రెస్ గెలుపొందింది. అనాజిపురంలో బీఆర్ఎస్ అభ్యరి హరికృష్ణపై కాంగ్రెస్ అభ్యర్థి బీసు వెంకన్న 673 ఓట్లతో గెలుపొందారు. 8 వార్డులు ఉండగా 8 వార్డులను కాంగ్రెస్ స్వీప్ చేసింది. పొడిచేడులో కాంగ్రెస్‌లో వర్గపోరుతో ఇద్దరు అభ్యర్థులను నిలబెట్టగా, బీఆర్ఎస్ కూడా పోటీ చేసింది. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ జిట్ట సైదులును నిలబెట్టగా, మరో కాంగ్రెస్ వర్గం నాయకులు పేలపూడి సత్యనారాయణచౌదరి, పేలపూడి వెంకటేశ్వర్లు జిట్ట లక్ష్మయ్యను పోటాపోటీగా నిలబెట్టారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా మెట్టు వీరస్వామి బరిలో నిలిచారు. ఇరువర్గాల పోటీలో వంగాల సత్యనారాయణ నిలబెట్టిన జిట్ట సైదులు 239 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 10 వార్డులకు 8 వార్డులు సత్యనారాయణ వర్గం, 2 వార్డులు పేలపూడి సత్యనారాయణచౌదరి వర్గం గెలుపొందారు. దత్తప్పగూడెంలో కాంగ్రెస్‌లో వర్గపోరు, నాయకుల మధ్య ఆధిపత్య పోరుతో 17 మంది నాయకులు నామినేషన్లు వేశారు. చివరకు ఎమ్మెల్యే సామేల్ ఇరువర్గాలతో మాట్లాడి కాంగ్రెస్ అభ్యర్థిగా గుండు యాదగిరిని నిలబెట్టారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోటీలో బీఆర్ఎస్ అభ్యర్థి లోకసాని ఉదయ్ కుమార్‌రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి గుండు యాదగిరి 264 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 10 వార్డులకు గాను 5 కాంగ్రెస్, 5 బీఆర్ఎస్ గెలిచింది. పాలడుగులో కాంగ్రెస్‌కు రెబల్ బెడద తప్పలేదు. ఇక్కడ యాస నర్సిరెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబెట్టగా మరో కాంగ్రెస్ నాయకుడు అంతటి భగవంతు రెబల్ అభ్యర్థిగా పోటీలో నిలిచారు. బీఆర్ఎస్ అభ్యర్థి మరిపెల్లి శేఖర్ మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆదేశాలతో అంతటి భగవంతుకు మద్దతునిచ్చారు. దీంతో బీఆర్ఎస్ మద్దతుతో అంతటి భగవంతు కాంగ్రెస్ అభ్యర్థి యాస నర్సిరెడ్డిపై 168 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 10 వార్డులకు 5 వార్డులు భగవంతు వర్గం, 5 వార్డులను నర్సిరెడ్డి వర్గం కైవసం చేసుకుంది. ముశిపట్లలో కాంగ్రెస్ అభ్యర్థి పైళ్ల నర్సిరెడ్డి 406 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాగిబావిలో బీఆర్ఎస్ అభ్యర్థి మెండు శ్రీవాణి 126 ఓట్లు, పనకబండలో బీఆర్ఎస్ అభ్యర్థి లోతుకుంట రేణుక 80 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థులపై గెలుపొందారు. అభ్యర్థుల ఎంపిక సందర్భంగా పొడిచేడు, సదర్శాపురం గ్రామాల కాంగ్రెస్ వర్గాల నాయకులు ఎమ్మెల్యే సామేల్‌తో గొడవకు దిగగా, ఆయన ఆ వర్గపోరుతో చిర్రెత్తిపోయి ఎవరు గెలిచి వస్తే వారికే కండువా కప్పుతానని ప్రకటించారు. పాలడుగులో బీఆర్ఎస్ మద్దతుతో గెలిచిన కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి అంతటి భగవంతు ఎమ్మెల్యే సామేల్‌తో కలుస్తారా లేక మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను కలిసి బీఆర్ఎస్‌లో చేరతారా అన్నది చూడాలి.